ప్రజాశక్తి

గురువారం 7 మార్చి 2024 5 విజయనగరం

11న అప్రెంటీస్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఉన్న ప్రభుత్వ ఐటిఐలో 11వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రధాని మంత్రి అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. రెడ్డి లాబ్స్, బెర్రీ ఆలోయస్, మైలాన్, వరుణ్ మోటార్స్, జయభేరి, జిందాల్ స్టీల్, డెక్కన్ ఫెర్రో ఆలోయస్ ప్రైవేట్ లిమిటెడ్, శారద స్టీల్స్, తదితర ప్రముఖ కంపెనీలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఎంపికైన వారికి ఆయా పరిశ్రమలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు జిల్లా కన్వీనర్ తెలియజేసారు. ఇంటర్మీడియట్ (వొకేషనల్) పాసైన అభ్యర్థులు కూడా ఈ మేళాకు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్‌లు, ఆధార్ కార్డు, 2 ఫోటోస్ తో పాటు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9849118075, 9849944654 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిర్వాసిత గ్రామం కొత్త అడ్డతీగల

- తాటిపూడి వచ్చే.. ఊరుపోయే...
- జిందాల్ కోసం భూములు పాయే
- ఇదీ కొత్త అడ్డతీగ గ్రామస్తుల దుస్థితి
- భూములు అప్పగించకపోతే జీవనోపాధి లేదంటున్న బాధితులు

జీవితమంతా నిర్వాసితులుగానే..

చిన్నతనంలో ఎంతో అమితంగా ఇష్టపడే ఊరు పోయింది. అప్పట్లో ఆ ఊరు నుంచి ఈ ఊరు ఎందుకు వచ్చామో మాకే తెలీదు. తీరా ఇక్కడికి వచ్చాక మా అమ్మ, నాయన మాటల ద్వారా అర్థమైంది... అక్కడేదో తాటిపూడి డ్యాం కట్టారని, దాని వల్ల ఊరు మునిగిపోయే పరిస్థితి ఉందని, అందువల్లే అక్కడి నుంచి ఇక్కడికి ప్రభుత్వమే తరమేసిందని. బాల్యం దశవరకు మేమంతా వ్యవసాయం, పాడిపంటలతో రాజుల్లా బతికేటోళ్లం. ఇప్పడా పరిస్థితి లేదు.

- ఇదీ ఎస్.కోట మండలం కొత్త అడ్డతీగ గ్రామంలోని వృద్ధుల జీవన గాధ.

తాటిపూడి జలాశయం నిర్మాణ సమయంలో మా తాతల నాటి భూములు అమ్మానాన్నలు కోల్పోయారట. ముంపుగ్రామంగా మారడంతో ఇదిగో ఇక్కడికి తరిమేశారు. అక్కడ కోల్పోయిన భూములకు బదులు ఇదిగో మా ఊరిపక్కనే ఈ భూములు ఇచ్చారట. ఒకప్పడు అడవిని తలపించే ఈ ప్రాంతం రాళ్లు,రప్పలతో నిండివుండేది. తమ యవ్వనమంతా ఇదిగో ఈ కనిపిస్తున్న భూములను చదును చేసి వ్యవసాయానికి అనువుగా తీర్చిదిద్దాము. కానీ, ఈ భూములు ప్రస్తుతం మా ఆధీనంలో లేవు. బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు పేరిట ప్రభుత్వమే భూములు లాగేసుకుని జిందాల్ సంస్థకు అప్పనంగా అప్పజెప్పింది. ఆలా మునుపు మా తండ్రులు పుట్టిన ఊరు కోల్పోతే, తాము భూములు కోల్పోయాం. జీవనోపాధికి దూరమయ్యాం.

- ఇది కొత్త అడ్డతీగ గ్రామానికి చెందిన నడివయస్కుల ఆవేదన.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అది 1965-68 మధ్య కాలం. అప్పటికే విశాఖపట్నం జనాభా పెరుగుతోంది. ఆ నగరానికి తాగునీరు అందించడంతోపాటు గంట్యాడ, జామి మండలాల్లో కొంతమేర సాగునీరు అందించాలనే లక్ష్యంతో తాటిపూడి జలాశయాన్ని నిర్మించారు. అప్పట్లో నాలుగైదు గ్రామాల ప్రజానీకం భూములు కోల్పోయారు. అడ్డతీగల గ్రామం పూర్తిగా ముంపునకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలోని నిర్వాసితులందర్నీ ఎస్.కోట మండలం తుంగమడుగుల - నిమ్మలపాలెం మధ్యలో నిర్వాసిత కాలనీ ఏర్పాటు చేసి, దానికే కొత్త అడ్డతీగల అని నామకరణం చేశారు. అప్పట్లో ప్రభుత్వమే నేరుగా ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోపాటు ఆచుట్టుపక్కలే భూమికి బదులు భూమి ఇచ్చింది. అప్పట్లో ఈ ప్రాంతమంతా చిట్టడివిని తలపించేదని, అందులోనూ రాళ్ల రప్పలు నిండివుండడంతో పంటల సాగుకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి చాలా సమయం పట్టిందని ఈ గ్రామానికి చెందిన సుగురి సన్యాసినాయుడు, చిన్నయ్యదొర ప్రజాశక్తికి వివరించారు. గ్రామం ఏర్పాటుచేసి సుమారు 59ఏళ్లు కావస్తోంది. సుమారు 100కుపైగా కుటుంబాలున్న ఈ గ్రామంలో నాడు కుటుంబ బాధ్యతలు మోసేవారిలో ఒకరిద్దరు తప్ప చాలా మంది ప్రస్తుతం ఈ గ్రామంలో లేరు. అప్పట్లో ఇక్కడికి మకాం మార్చినవారి కొడుకులు, కూతుళ్లు కూడా ప్రస్తుతం వృద్ధాప్యానికి చేరుకున్నారు. అయినా సరే.... తాటిపూడి నిర్వాసితులుగా అప్పట్లో ప్రభుత్వం తమ తాత, తండ్రులకు ఇచ్చిన భూములపై కాయ,కష్టం చేసుకుని జనం బతుకీడ్చేవారు. ఇదంతా గతం మాట.

2006లో ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తామంటూ బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి పంచాయతీల పరిధిలోని బొడ్డవర, లక్ష్మీపురం, అమ్మవలస, మొట్టవలస, చినఖండేపల్లి, ముషిడిపల్లి, కొత్త అడ్డతీగల తదితర గ్రామాల పరిధిలోని 1127 ఎకరాలను ప్రభుత్వం రైతులను నుంచి బలవంతంగా లాక్కుని జిందాల్‌కు అప్పగించింది. అప్పట్లో ఎకరాకు రూ.2.5లక్షల చొప్పున మాత్రమే పరిహారం ఇచ్చారు. అది కూడా పట్టాలు ఉన్నవారికి మాత్రమే. తాటిపూడి జలాశయ సమయంలో ప్రభుత్వం తమ తాతల వద్ద జిరాయితీ పట్టా భూములు తీసుకున్నప్పటికీ, డి-పట్టాలతో భూములు అప్పగించారని ఈ గ్రామానికి చెందిన పాగి రాము, నారికేలం నర్సమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములు కాదనే నెపంతో తమకు పరిహారం ఇవ్వకుండానే లాగేసుకున్నారని చెప్పారు. గట్టిగా అడిగితే ఎంతో కొంత ఇస్తామంటూ చెప్పిన అధికారులు, నాయకులు ఇప్పుడు కనిపించడం లేదని మొరపెట్టుకుంటున్నారు.

మరోవైపు జిందాల్ హామీ ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వడానికి ఇక్కడ అసలు కంపెనీయే ఏర్పాటు చేయలేదు. మరోవైపు భూములు కోల్పోయారు. అంతకు ముందు ఊరే వదులు కోవాల్సివచ్చింది. మరోవైపు ఆయా భూములను రూ.112.77 కోట్లకు జిందాల్ సంస్థ బ్యాంకులో తనఖా పెట్టి తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తిరించుకున్నట్టుగా తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఇదే భూముల్లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ ఏడాది క్రితం రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

జీవితాంతం నిర్వాసితులమే

నా జీవితం మొత్తం నిర్వాసితుడిగానే మిగిలిపోయింది. మా పిల్లలకు కూడా భరోసా ఇవ్వలేక పోతున్నాం. 50ఏళ్ల క్రితం తాటిపూడి జలాశయ నిర్మాణంలో భాగంగా అడ్డతీగల గ్రామం ముంపు ప్రాంతంగా మారింది. నా చిన్నప్పుడు అక్కడ మా తాత తండ్రుల నుంచి వచ్చిన భూములు పోయాయి. కొత్త అడ్డతీగల పేరిట అప్పట్లో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. మాతోపాటు 50 కుటుంబాలవారికి 3ఎకరాల చొప్పున బీడు భూములకు డి-పట్టాలు ఇచ్చారు. తీరా వాటిని సాగుకు అనుగుణంగా తయారు చేసేసరికి 18ఏళ్ల క్రితం తిరిగి లాగేసుకున్నారు. డి-పట్టా పేరుతో పరిహారం కూడా ఇవ్వలేదు. పరిశ్రమా లేదు. ఉద్యోగాలు లేదు. భూమీలేదు. తిరిగి ఆ భూములిస్తే తప్ప బతుకు లేదు.

- నారికేలం అప్పన్న, కొత్త అడ్డతీగల గ్రామం

రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పోలింగ్ ప్రక్రియపై అవగాహన ఉండాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లను దాఖలు చేసే విధానం, సువిధ యాప్ ద్వారా ధరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఇఆర్ఒలకు, నోడల్ అధికారులకు కలెక్టరేట్‌లో బుధవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 1172 ప్రదేశాల్లో మొత్తం 1847 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో 11 పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ స్టేషన్లుగా రూపొందించామని తెలిపారు. వీటిలో రెండింటిని యువత, 7 కేంద్రాలను మహిళలు, మరో రెండు పోలింగ్ స్టేషన్లను వికలాంగులే పూర్తిగా నిర్వహిస్తారని, ఆయా వర్గాల్లో స్ఫూర్తిని నింపి ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్, ఎండ నుంచి రక్షణ కోసం షామియానా, సహాయం చేసేందుకు వలంటీర్లను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 15,41,001 మంది ఓటర్లుగా నమోదు అయ్యారని, వీరిలో 7,60,400 మంది పురుషులు, 7,80,518 మంది మహిళలు, 83 మంది థర్డ్ జెండర్ ఉన్నారని చెప్పారు.

90 నిమిషాలముందే మాక్ పోలింగ్

ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ, పోల్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పోలింగ్ రోజున చేసే ఏర్పాట్లు, అధికార బందాల నియామకం, వాహనాలు సమకూర్చడం, ఇవిఎంలు, మాక్ పోల్, సువిధ, ఇజిఆర్ఎస్, పోలింగ్ రోజు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, హెూమ్ ఓటింగ్, మోడల్ కోడ్ అమలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించే సదుపాయాలు, వ్యయ నియంత్రణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ ఎన్నికల్లో కొత్తగా హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టిందని, దీనికోసం ముందుగానే ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వయసు 85 ఏళ్లు పైబడినవారు, 45 శాతం వికలాంగత్వం ఉన్న వారు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదుల కోసం 24 గంటలూ పనిచేసే కంప్లయింట్ సెల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమలు

నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు తమ ఆస్తులు, తమపై నమోదై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉందని ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ చెప్పారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసే విధానం, నిబంధనలు, జత పరచాల్సిన పత్రాలు తదితర అంశాలను వివరించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 1532 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో బుధవారం 73 కేంద్రాల్లో జరిగిన ఇంటర్ పరీక్షకు 23166 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా మొత్తం 24698 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 23166 మంది హాజరు కాగా,1532 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ఆర్ఐఒ ఎం.ఆదినారాయణ తెలిపారు.

రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జెసి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్

పంట నష్టానికి పరిహారం

1059 మంది రైతులకు 50.62 లక్షల పెట్టుబడి రాయితీ

ప్రజాశక్తి-విజయనగరం

గత ఏడాది డిసెంబర్ లో సంభవించిన మిచాంగ్ తుఫాన్ పంట నష్టం కింద పరిహారం అందించడంలో భాగంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్, డిసిఎంఎస్. చైర్‌పర్సన్ అవనాపు భావన, జిల్లా వ్యవసయాధికారి తారక రామారావు , రైతులు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మెగా చెక్కును లబ్దిదారులకు అందజేశారు. జిల్లాలో 2023 మిచంగ్ తుఫాన్ కు 297.77 హెక్టార్ల విస్తీర్ణం లో పంట నష్టం జరిగింది. ఇందుకు గాను ఇన్పుట్ సబ్సిడీ కింద జిల్లాలో 1059 మంది రైతులకు 50.62 లక్షల పెట్టుబడి రాయితీని జమ చేశారు.

ముగిసిన టెట్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతనెల 27వ తేదీ నుంచి జిల్లాలో 5 కేంద్రాల్లో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా టెట్ పరీక్ష కు మొత్తం 11580 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 10429 మంది హాజరయ్యారు. 1151 మంది పరీక్షకు హాజరు కాలేదని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు.

గృహవసతి కల్పనే ధ్యేయం : కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అర్హులైన పేదలకు గృహ వసతి కల్పించడమే కాకుండా పూర్తి హక్కులను కూడా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. బుధవారం 8, 12 డివిజన్ల పరిధిలోని ఇళ్లపట్టాల లబ్ధిదారులకు పూర్తి హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయడమే కాకుండా పూర్తి హక్కులను కూడా కల్పిస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలోని 28వ డివిజన్ రాజీవ్‌నగర్, పిఎస్ ఆర్ కాలనీలలో రూ.90 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాజీవ్ నగర్ ఆర్చి నుండి ఆంజనేయస్వామి ఆలయం వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ నగరంలో ఇప్పటివరకు అభివద్ధిని చేసి చూపించామని, మరోసారి అవకాశం ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. దాసన్నపేట వాటర్ ట్యాంక్ నుండి రాజీవ్ నగర్ కు పైప్ లైన్లు వేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పించానన్నారు. గతుకుల మయంగా ఉండే రహదారిని పునర్నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, స్థానిక కార్పొరేటర్ జాకీర్ హుస్సేన్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

సిసి రహదారులు ప్రారంభం

నగరంలోని 38,43 డివిజన్ల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి రహదారులను మేయర్ విజయలక్ష్మి ప్రారంభించారు. 38వ డివిజన్ బొబ్బాది పేటలో 9 లక్షల రూపాయలతోనూ, 43వ డివిజన్ ఉడా కాలనీలో 17.50 లక్షల రూపాయలతోనూ సిసి రోడ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జి డాక్టర్ వివిఎస్ ప్రసాద్, స్థానిక కార్పొరేటర్లు తొగురోతు సంధ్యారాణి, దాసరి సత్యవతి, బొబ్బాది త్రినాధరావు, వంతరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు 444 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్ కళాశాలలో బుధవారం జరిగిన మెగా జాబ్ మేళాలో సుమారు 444 మంది అభ్యర్థులు హాజరయ్యారు. డాక్టర్ రెడ్డీస్‌లో ట్రైనీ అప్రంటీస్ (90), భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూసిన్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్ (150), శ్రీరక్షిత బిజినెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలీకాలర్స్(20), డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో ట్రైనీ కెమిస్ట్, అపరేషన్స్, మెయింటనెన్స్, ప్రొడక్షన్ ఎఎన్ఎఫ్‌డి (50), హెట్రో ల్యాబ్స్ లిమిటెడ్‌లో ప్రొడక్షన్, టీంలీస్ (ఎస్‌బిఐ కార్డ్స్)లో బ్రాంచ్ రిలేషన్ షిప్ ఎగ్జిక్యూటర్(150), ముత్తూట్ ఫైనాన్స్‌లో (150), తదితర ఉద్యోగాల భర్తీ కోసం ఈ జాబ్ మేళాను నిర్వహించారు. మేళాకు హాజరైన వారిలో 153 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు లక్ష్మీదుర్గ, మణికంఠ, బి.జయరామ్, నూరాన్వర్, జి.నాణేశ్వర్, కె.సురేష్, టి.పవన్, శివశంకర్, ప్రొఫెషన్ ఎం.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

శునకానికి వినతినిస్తూ నిరసన

ప్రజాశక్తి- మెంటాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాలు అధ్వర్యంలో గిరిజనులు మూడురోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న నేపథ్యంలో బుధవారం వినూత్నంగా శునకానికి వినతినిచ్చి నిరసన తెలిపారు. అదికారులు ప్రజాప్రతినిధుల సాగుచేస్తున్న భూముల్లో గిరిజనులకు పట్టాలివ్వాలని, సమగ్ర సర్వే నిర్వహించి అర్హత వున్న గిరిజన హరిజన నిరుపేదలకు శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ చేయాలని ప్రజాసంఘ నేతలు తామారాపల్లి సోములు, రాకోటి రాములు డిమాండ్ చేశారు. జయతి, కొండలింగాలవలస, ఉద్దంగి, లోతుగెడ్డ, ఆగూరు పంచాయతీలలో అరకొర సర్వే నిర్వహించి అదికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ఆంద్ర, నిక్కలవలస, కూనేరు, గురమ్మవలస, పులిగుమ్మి, పోరాం, పంచాయతీలలో సర్వేలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చే వరకు వినూత్న రీతిలో నిరసనలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉయ్యాల సోములు, సిడగం సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అగ్ని భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశ్రామిక అగ్ని భద్రత పై అవగాహన కల్పించారు. లక్ష్మణ్ అకాడమీ ఫర్ ఫైర్ సేఫ్టీ సంస్థ ప్రిన్సిపాల్ ఉస్మాన్ ఖాన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉస్మాన్ ఖాన్ పారిశ్రామిక రంగ కార్మికులకు సమగ్ర భద్రతా శిక్షణ, ప్రమాదాల గుర్తింపు, అత్యవసర ప్రతిస్పందన ప్రోటోకాల్ వంటి కీలకమైన అంశాలను వివరించారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థలు డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణరావు, ప్రిన్సిపాల్ డివి రామమూర్తి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సిహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

సిటియులో సైన్సు సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సైన్స్ సంబరాల్లో భాగంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గిరిజన యూనివర్శిటీలో నిర్వహించారు. బుధవారం ముఖ్య అతిథిగా ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పిసి జోషి, గౌరవ అతిథి ప్రొఫెసర్ పిబి హైదరాబాదు విశ్వవిద్యాలయానికి చెందిన ఎమెరిటస్ సైంటిస్ట్ కీర్తి హాజరయ్యారు. తమ జ్ఞానం మరియు అనుభవంతో సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలని, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు సాంప్రదాయ జ్ఞానంలో శిక్షణపొందాలని జోషి అన్నారు. గిరిజన యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్, టి వి కట్టిమణి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థ అంతటా విస్తరించాలన్నారు. హెడ్ డాక్టర్ పి. శ్రీదేవి ఆధ్వర్యాన బయోటెక్నాలజీ విద్యార్థులు చేసిన పూల గైడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి యువతలో శాస్త్రీయ ఆలోచనను పెంపొందించారు. గెలుపొందిన విద్యార్థులందరికీ సైన్స్ డే మెడల్స్ అందజేశారు.

జెఎన్‌టియులో జాతీయ సింపోజియం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు మెటలార్జికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెండు రోజులు పాటు జరగనున్న జాతీయ సింపోజియంను వైస్ ఛాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య బుధవారం ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక మార్పును అవగతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. థియరీ నాలెడ్జ్‌తో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ ద్వారానే మంచి విద్యను అందిపుచ్చుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులు పాల్గొన్నారు.

11లోగా జీతాలు వేస్తారు..చర్చలకూ వస్తారు

మిమ్స్ ఉద్యోగులకు ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

'మీ న్యాయమైన సమస్యలపై మిమ్స్ యాజమాన్యంతో మాట్లాడాను. ఈ నెల 11వ తేదీ లోపు జీతాలు వేస్తామని, యూనియన్‌తో చర్చలు కూడా జరుపుతామని అంగీ కరించారు.' అని మిమ్స్ ఉద్యోగులకు, కార్మికులకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు, మిమ్స్ ఉద్యోగులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడుకు బుధవారం కొండవెలగాడలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి వి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ గత మూడేళ్లగా మిమ్స్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికులకు 7 డిఎలు ఇవ్వలేదని, వేతన ఒప్పందం చేయలేదు సరికదా ఇంతవరకు జనవరి నెల జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించ -ాలని అడిగితే వేధింపులు, సస్పెండ్ చేయడం వంటి చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. సమస్య చొరవ చూపించి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. త్వరలో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో మిమ్స్ ఉద్యోగులు ఎం.నారాయణ, కె.మధు, ఎం.నాగ భూషణం, ఎం.రాంబాబు, కె. కాము నాయుడు, గౌరీ, వరలక్ష్మి, బంగారు నాయుడు, మూర్తి, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న సిఐటియు నాయకులు

టిడిపిలో చేరిన వైసిపి కార్పొరేటర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని 8వ డివిజన్ కార్పొరేటర్ ద్వాదశి సుమతి, జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు ద్వాదశి వేణు జిల్లా ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నమ్మి ప్రసాద్ తోపాటు మరో వంద కుటుంబాల వారు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం అశోక్‌బంగ్లాలో ఆపార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి విజయలక్ష్మి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి అదితి గజపతి ఆహ్వానించారు. అనంతరం అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు కొన్ని లక్షణా లుంటాయని, వాటిని మర్చిపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త ప్రభుత్వమని విమర్శించారు. ద్వాదశివేణు మాట్లాడుతూ వైసిపి కబంధ హస్తాలనుంచి విముక్తి లభించిందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపిరాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్,సువ్వాడ రవిశేఖర్, ఎ.వాసుదేవరావు, ఎస్.వెంకటరావు, రవి శేఖర్, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ సుమతిని టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అశోక్, అదితిగజపతి

వాకర్స్ అంతా మద్దతివ్వాలి

తనకు వాకర్స్ అంతా మద్దతివ్వాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి కోరారు. విజ్జీస్టేడియంలో క్రీడాకారులను,వాకర్స్‌ను బుధవారం కలిశారు. వైసిపి ప్రభుత్వం అసమర్థ, అరాచక పాలన గురించి వివరించారు. రాష్ట్రాన్ని నాశనం చేసేలా సాగిస్తున్న ఈ పాలనను తరిమికొట్టాలని విజ్ఞప్తి చేసారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును అన్ని రంగాలలో బాగుండాలంటే తెలుగుదేశం - జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కావాలని, అందుకు మీ మద్దతు అవసరమని కోరారు. విజ్ఞులైన మీరు అలోచించి రాబోయే ఎన్నికలలో సైకిల్ గుర్తు పై ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు.

'చలో అమరావతి'ని విజయవంతం చేయాలి

గంట్యాడ: ఈ నెల 9వ తేదీన అమరావతిలో జరగనున్న వికలాంగుల మహాగర్జన సభను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట కమిటీ జాతీయ కార్యవర్గ సభ్యులు కనక వెంకటరమణ కోరారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచాలని, ఉద్యోగ రోస్టర్ పాయింట్లు పది లోపు ఇవ్వాలని అన్నారు. పేదలైన వికలాంగుల కుటుంబాలకు ఉచితంగా హెల్త్ కార్డు ఇవ్వాలని 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇవ్వాలని, ఇంటి పన్ను మినహాయించాలని ఆరు సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని కోరారు.

పూసపాటిరేగలో పోలీస్ కవాతు

పూసపాటిరేగ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని కుమిలి, రెల్లివలస గ్రామాల్లో బుధవారం పోలీస్ కవాతు నిర్వహించారు. భోగాపురం సర్కిల్ సిఐ బి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాల్లో ఈ కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కొనేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించడానికి ఎస్‌పి ఎం.దీపిక ఆదేశాలతో ఈ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్ఐ సన్యాసి నాయుడు, కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పైలేరియా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

నెల్లిమర్ల: ఒమ్మి గ్రామాన్ని పైలేరియా రహిత గ్రామంగా తీర్చి దిద్దాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు కోరారు. బుధవారం ఒమ్మి గ్రామాన్ని సాయి ఫార్మాస్యూటికల్ కంపెనీ నుండి డాక్టర్ అనిల్ ఖీలే, జోసెఫ్, మదన్ మోహన్, మనిష్ కుమార్, చిరంజీవి సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో సమావేశం నిర్వహించి పైలేరియా పై అవగాహన కల్పించారు. 72 మంది పైలేరియా వ్యాధి గ్రస్తులకు మార్బిడిటీ కిట్లను వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కె సాయిరామ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై దర్యాప్తు చేయాలి

బొబ్బిలి: మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కాంగ్రెసు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో అధికార పార్టీ అవినీతికి మున్సిపల్ డిఇ కనకరాజు అడ్డు వస్తున్నారని అన్యాయంగా బదిలీ చేశారన్నారు. అభివృద్ధి పనులు చేయకుండా బిల్లులు పెట్టడం, కొనుగోలు చేయని వస్తువులకు బిల్లులు పెట్టడంతో డిఇ అడ్డుకోవడం వల్లనే బదిలీ చేశారని విమర్శించారు. మున్సిపల్ అవినీతి, అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి

బొబ్బిలి: కూరగాయల మార్కెట్లో ఉన్న సామూహిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. కూరగాయల మార్కెట్, మరుగుదొడ్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మార్కెట్లో చెత్తను కూడా ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. కూరగాయలు మార్కెట్లోకి పశువులు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పశువులు రాకుండా చూడాలని కమిషనర్ రామలక్ష్మిను వ్యాపారులు కోరారు.

నేడు ఇపిఎఫ్ పెన్షనర్ల ధర్నా

గరివిడి : ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై గురువారం విశాఖపట్నంలో ఉన్న పిఎఫ్ కార్యాలయం దగ్గర నిర్వహించనున్న ధర్నాను విజయ వంతం చేయాలని ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం నాయకులు మూర్తి, సిఐటియు నాయకులు గౌరినాయుడు, మూర్తి, సలీం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ధర్నాకు గరివిడి, చీపురుపల్లి మండలాల్లో ఉన్న పిఎఫ్ పెన్షనర్దారులందరూ హాజరవ్వాలన్నారు. విశాఖపట్నం బయలుదేరవలసిన వారు ఉదయం 7గంటలకు గరివిడి రైల్వే స్టేషన్కు రావాలని విజ్ఞప్తి చేశారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

బొబ్బిలి: జనసేన-టిడిపి కూటమి గెలుపుకోసం పని చేయాలని జనసేన, టిడిపి నియోజకవర్గ ఇంచార్జిలు గిరడ అప్పలస్వామి, బేబినాయన కోరారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్లో జనసేన నూతన కార్యాలయాన్ని వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన-టిడిపి కూటమి విజయానికి జనసైనికులు, టిడిపి కార్యకర్తలు పని చేయాలన్నారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కోసం సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబర్తి శరత్, వి.సత్యనారాయణ, జనసేన నాయకులు ఆదాడ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

గరివిడి: మండలంలోని కొండ లక్ష్మీపురం గ్రామానికి చెందిన కేన్సర్ రోగి పల్లి స్వామి నాయుడు కుటుంబానికి ధీరా ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ స్వామినాయుడు గత 8 ఏళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. నిరు పేద కావడంతో ఆతనికి ఈ సాయం అందించామని వెల్లడించారు.

జాకేరులో ఆరోగ్య సురక్ష

వేపాడ: మండలంలోని జాకేరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 433 మంది రోగులు హాజరు కాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పీహెచ్ పరిధిలోని మెరుగైన వైద్య సేవల కోసం రిఫర్ చేశారు. వీరికి వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ధరణి ఆధ్వర్యంలో వైద్యులు నీలి, ఎస్ ఆచారి, ఈశ్వరరావు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో సర్పంచ్ చిన్నమ్మలు, నాయకులు అప్పలనాయుడు, ఎంపిటిసి రమణ, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

గరివిడి: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉన్నత స్థాయికి ఎదుగుతారని ధీరా ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ అన్నారు. గరివిడి పట్టణంలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో గుర్ల మండలానికి చెందిన 70 టీమ్‌లకు క్రికెట్ కిట్లు బుధవారం అందజేశారు. యువకులకు ఏ అవసరం వచ్చినా ఆదుకునేందుకు తాను ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కె.వి. సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన మంచినీటి బోరును టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ ఇబ్బంది కలిగినా తానున్నానని అన్నారు. గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి బాటలో నడిపే విధంగా తన సొంత ఖర్చుల కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, మేరుకొండ్ల పైడిబాబు, గనివాడ సన్యాసి నాయుడు, లగుడు ఎర్రినాయుడు, కిలపర్తి హరి, పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రేగిడి: పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ బుడుమూరు పట్టాభి, మండల విద్యాశాఖాధికారి మజ్జి శ్రీనివాసరావు, ప్యారి షుగర్ హెచ్ ఆర్ అండ్ మేనేజర్ హెడ్ మురళీకృష్ణ అన్నారు. బుధవారం సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. గోల్ సాధించాలంటే మొదటి మెట్టు 10వ తరగతి పరీక్ష లేదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గెలుపొందిన విద్యార్థులకు ప్యారీ షుగర్ యాజమాన్యం ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కర్రి జ్యోతి, పాఠశాల హెచ్ఎం మరిపిలి రామినాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - బొబ్బిలి

టిడ్కో గృహ సముదాయం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్‌ను టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు నెలాఖరులోగా పూర్తి చేసి పంపిణీ చేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశించడంతో టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం టిడ్కో ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్యాకేజీ ఇవ్వని శంకుస్థాపనలెందుకు?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారిపల్లి గ్రామానికి పునరావాస ప్యాకేజీ ఇవ్వని ప్రారంభోత్సవాలు ఎందుకని నిర్వాసితులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్‌ని ప్రశ్నించారు. బుధ వారం సారిపల్లి గ్రామంలో జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కొళాయి శంకుస్థాపనకు, అంగన్వాడీ భవనాల ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యే బడుకొండు అప్పలనాయుడు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, వైసిపి మండల నాయకులు అంబళ్ల శ్రీరాములు నాయుడులను టిడిపి, జనసేన, బిజెపి, ఇతర దళిత సంఘం నాయకులు అడ్డుకుని నిర్వాసితుల తరుపున ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తారకరామ తీర్ధసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులైన సారిపల్లి పంచాయతీలోని 1450 కుటుంబాలకు రూ.75 కోట్ల బడ్జెట్ కేటాయించి పిఎఎఫ్ ప్యాకేజీ మంజూరు చేసామని చెప్పి ఇన్నాళ్ళు గడిచినప్పటికీ ఎటువంటి కదలిక లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఈ శంకుస్థాపనలు దేనికోసమని మండిపడ్డారు. అధికారంలోకి రావడానికి ముందు సాక్షాత్తూ ఎమ్మెల్యే ప్యాకేజీ విషయమై మాట ఇచ్చారని, ఆ నమ్మకంతో సర్పంచ్ ఎన్నికలలో వైసిపి బలపర్చిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో గెలిపించామని, ఎంపిటిసి సీటు కూడా ఏకగ్రీవంగా వైసిపి పార్టీకి ఇచ్చామని గుర్తు చేశారు. ఎంపిటిసి సీటు ఇచ్చిన సంవత్సర కాలంలో ప్యాకేజీ రాని పక్షంలో పదవులకు మూకుమ్మడి రాజీనామా చేస్తామని మాట ఇచ్చి తప్పారని వాపోయారు. గ్రామం మొత్తం వైసిపికి అన్ని విధాలా సహకరించినప్పటికీ గ్రామానికి ప్యాకేజీ విషయంలో

ఎమ్మెల్యే, ఎమ్‌పిలను నిలదీసిన సారిపల్లి నిర్వాసితులు

ఎమ్‌పి, ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న నాయకులు, నిర్వాసితులు

మొండి చెయ్యి చూపారని ఈ విషయమై సమాధానం చెప్పాల్సిందేని ప్రశ్నించారు. దీంతో వైసిపి ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు ప్రశ్నించిన నిర్వాసితులు, ఇతర పార్టీల నాయకులపై అసహనం ప్రదర్శించారు. దీంతో ఎమ్మెల్యే గో బ్యాక్ అనే నినాదాలతో హోరెత్తించారు. స్థానిక వైసిపి నాయకులు ఒత్తిడి మేరకు ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలు సైతం నాయకులను వ్యతిరేకించడంతో ఎంపి అసహనం వ్యక్తం చేస్తూ అవసరమైతే ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కుతో సమాధానం చెప్పండి అని సలహా ఇచ్చి శంకుస్థాపన త్వరగా ముగించుకుని వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు బి. ఆదినారాయణ, సారిపల్లి బాబూరావు, ఎస్ గోపి, కె సీతారామ్, జనసేన నేతలు సంతోష్ కుమార్, నాగేష్, భాస్కర్, బిజెపి నాయకులు కొరటాన రామారావు, దళిత సంఘం నాయకులు రాయి ఈశ్వర్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాదాన్యతనిస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. బుధవారం కొండ వెలగాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని వారు ప్రారంభించారు. అంతకముందు సారిపల్లిలో జల జీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. దీనిలో భాగంగా పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి పిహెచ్‌సి నూతన భవనం, జలజీవన్ మిషన్ పథకం ద్వారా సురక్షిత తాగు నీటిని ఇంటింటికి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, పూసపాటి రేగ ఎఎంసి చైర్మన్ చిక్కాల అరుణ కుమారి, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారికి వైకుంఠం, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, నాయకులు డి.గిరిబాబు, తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, డిఎంహెచ్ఒ భాస్కర రావు, సారిపల్లి సర్పంచ్ రాయి పైడమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే వారపు సంత

ప్రజాశక్తి- బొబ్బిలి

రైతులు కోసమే వారపు సంత నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఎఎంసి ఆధ్వర్యంలో వారపు సంతను ప్రారంభించారు. పాడి రైతులు కోసం వారపు సంత ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వారపు సంతను పాడి రైతులు, అనుబంధ రంగాల వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తెంటు పార్వతమ్మ, మండల జెసిఎస్ కన్వీనర్ టి.దామోదర్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో శ్రీకళాభారతి

పేదలకు అందుబాటులో శ్రీకళాభారతి సేవలు ఉన్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఎసి సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఫంక్షన్లు చేసుకునే విధంగా శ్రీకళాభారతి ఆడిటోరియాన్ని గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేసినట్లు చెప్పారు. శ్రీకళాభారతి సేవలు ప్రజలకు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణను ఎమ్మెల్యే శంబంగి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళి, వైస్ చైర్మన్ చెలికాని మురళి, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, శ్రీకళాభారతి కమిటీ సభ్యులు కర్రి సత్యనారాయణ, వేణుగోపాల్, పి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

బొబ్బిలిరూరల్: నూతన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే

సంతను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అప్పలనాయుడు బుధవారం రంగరాయపురంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు ఉత్తరావల్లి అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి 600 కుటుంబాలు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని ఉద్దవోలులో సుమారు 600 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. మరడాల చిన్నమ్మ, ఎంపిటిసి తమ్మి రెడ్డి రమణ, వైస్ ప్రెసిడెంట్, వార్డు మెంబర్లకు టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కృష్ణ విగ్రహానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, ఎన్ వెంకటేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సచివాలయ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వీరనారాయణ పట్టణంలోని సీతమ్మ పేటలలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ద్వార అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా కులం, మతం, పార్టీతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని అన్నారు. ముందుగా వీరనారాయణం గ్రామంలో గ్రామ సందర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, జెసిఎస్ మండల ఇంచార్జి వాకాడ సతీష్ పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బొద్దాంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం

వేపాడ: ఎమ్మెల్యే మాట్లాడుతున్న కడుబండి శ్రీనివాసరావు

ప్రారంభించారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ ఎర్ర రామలక్ష్మి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, ఉప సర్పంచ్ వెంకీ, వైసిపి మండల అధ్యక్షులు జగ్గు బాబు, నాయకులు ఆర్ రాజేష్, టీవి రమణ, వంటాకు శ్రీను, గంగు నాయుడు, పంచాయతీ కార్యదర్శి పద్మ, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల విజయోత్సవ సభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మున్సిపల్ కార్మికులు 16 రోజుల సమ్మె పోరాట సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ రాతపూర్వకంగా ఇచ్చిన హామీల్లో భాగంగా 9 జీవోలు వచ్చాయి. మరో 7 జీవోలు రావాల్సి ఉంది. పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24,500లు బేసిక్ వేతనం అమలు చేస్తూ మార్చి 1 న జీవో నెంబర్ 36 ఇచ్చిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ. జగన్మోహన్ రావు తెలిపారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రావు మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన తుపాకుల రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు

మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు, కిల్లంపల్లి రామారావు

కొండ వెలగాడ గ్రామంలో, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు. ఇతర విభాగాల్లో పనిచేస్తున్న వారందరికీ జీతం పెంచాలని, అధ్యాయన కమిటీ రిపోర్ట్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె. రామారావు, నాయకులు శ్రీను, హరిబాబు, లక్ష్మి, శంకర్, దుర్గారావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా..

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి,జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలో కోమటిపల్లి సమీపంలో బుధవారం నిర్వహించిన టిడిపి మండల సమావేశంలో ఈయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సీనియర్లను కలుపుకొని గజపతినగరం నియోజకవర్గ అభివృద్ధికి సాయి శక్తులా కృషి చేస్తానని అన్నారు. యువతన ప్రోత్సహించి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యులు చేయాలని ఉద్దేశంతో టిడిపి జాతీయ అధ్యక్షులు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తనకు ఈ అవకాశం కల్పించారన్నారు. వైసిపి విముక్తి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడాలంటే, వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో టిడిపి, జనసేన

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్

నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఉమ్మడి కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలని జనసేన నాయకులు మర్రాపు సురేష్ అన్నారు. ఈ సమావేశంలో గంట్యాడ మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, జనసేన పార్టీ ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఆదాడ మోహన్ రావు, మాజీ ఎంపిపి బెజవాడ రాజేశ్వరి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మిత్తి రెడ్డి ఈశ్వరరావు, నాయకులు, చెల్లూరి సత్య రావు, గుసిడి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

మహిళలను గౌరవించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- బొబ్బిలి

మహిళలను గౌరవించాలని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ, ఎంపిపి శంబంగి లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళలకు పాటలు, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి, జెడ్‌పిటిసి ఎస్.శాంతి కుమారి, ఎంపిడిఒ రవికుమార్,

బొబ్బిలి: మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరివిడి : మండలంలోని కోడూరులో జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ సంయుక్తంగా బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సమతా కన్వీనర్ ఎం. సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి ప్రతినిధులు, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో స్వయం సమృద్ధిని సాధించాలని, చైతన్యంతో ముందుకు కదలాలని, తమ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని, టీవీలలో వస్తున్న సీరియల్స్, సెల్ ఫోన్స్ దృశ్యాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు వి. మోహన రావు, గొర్లె రమణ, సత్యారావు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి. పద్మావతి, ఎ. సత్య శ్రీనివాసు, కోడూరు నాయకులు గేదెల ఆదినారాయణ, ఉప సర్పంచ్ జి. శంకర రావు, మహిళా ఉపాధ్యాయులు, మహిళా వాలంటీర్‌లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు

ప్రజాశక్తి- బాడంగి

సచివాలయ సిబ్బంది సమయానికి కార్యాలయాలకు రావడం లేదని దీంతో సచివాలయాలు ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయని వేళలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి ఏ.సురేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ముగడ సచివాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చినా ఫలితం లేకపోతుందన్నారు. ఉద్యోగులు సమయానికి కార్యాలయాలకు రాకపోవడంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని అడితే

ఉద్యోగులు లేక ముగడ సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మీరు శుభ్రంగా పనిచేయడం లేదు మీకెందుకు జీతాలని ఎద్దేవా చేసే పంచాయతీ కార్యదర్శులు సమయానికి కార్యాలయాలకు రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇటువంటి వారిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

నిబంధనల మేరకే నియమించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

నరసాపురం పంచాయతీలో ఖాళీ అయిన ఆశావర్కర్ నియామకం నిబంధనల మేరకే జరపాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ కోట వెంకట నాయుడు టిడిపి నాయకులతో కలిసి ఆరికతోట పిహెచ్‌సి ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో పనిచేసిన ఆశా వర్కర్ కరోనాతో మృతి చెందడంతో ఈ పోస్ట్ ఖాళీ అయ్యిందని అప్పటి నుంచి కాలయాపన చేస్తూ ఇప్పుడు హడావిడిగా ఈ పోస్ట్ భర్తీకి స్థానిక అధికార పార్టీ నేతలు అడ్డదారిలో ఎటువంటి నోటిఫికేషన్, పంచాయతీ తీర్మానం లేకుండా భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం హేయమైన చర్య అని అన్నారు. వెంటనే నిబంధనలతో కూడిన నోటిఫికేషన్ జారీ చేసి అర్హులైన వారికి పోస్ట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారి రత్నదీపక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మరిపి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, కోట ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మామిడి, జీడి తోటలు దగ్ధం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వి.వి.ఆర్ పేట పంచాయతీ జెకె గుమ్మడ పరిధిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పడేయడంతో గ్రామానికి చెందిన జక్కు గణపతి, జక్కు సూర్యనారాయణ తోపాటు మరికొంతమంది రైతులకు చెందిన సుమారు 5 ఎకరాల్లో మామిడి జీడి తోటలు దగ్ధమైనట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం మామిడి జీడి తోటలు పువ్వు, పింజ దశలో ఉండటంతో ఎక్కువ పంట నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూములు లాక్కోవడం అన్యాయం

ప్రజాశక్తి- రేగిడి

పేదలకు గత ప్రభుత్వాలు ఇచ్చిన డీ పట్టా భూములను ప్రస్తుతం లాక్కోవడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల నాయకులు మడపాన త్రినాథ్ అన్నారు. బూరాడలో లుకలాపు నారాయణమ్మకు చెందిన సర్వేనెంబర్ 64-2లో 75 సెంట్లు భూమిని అక్రమంగా, అన్యాయంగా గ్రామస్థాయి పెత్తందారులు ఆక్రమించుకోవడం అన్యాయమని అన్నారు. ఈ మేరకు ఆ భూములను వారు పరిశీలించి మాట్లాడారు. ఆమె ఒక షెడ్ కట్టుకొని

భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నివాసముంటే ఆ షెడ్డును తొలగించి 79 సంవత్సరాల నారాయణమ్మను బెదిరించడం, కొట్టడం దుర్మార్గపు చర్యని అన్నారు. 47సంవత్సరాల క్రితం పట్టా ఇచ్చారని ఈ 75 సెంట్లు భూమి రాజాం పాలకొండ రోడ్డును ఆనుకొని ఉన్నందున ఆక్రమించుకునేందుకు వైసిపి నాయకులు చూస్తున్నారన్నారు. వీళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'గురుదేవ్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కొత్తవలస

మానవ జీవితాన్ని ప్రతి ఒక్కరూ భగవత్ సేవలో సద్వినియోగం చేసుకోవాలని ఇస్కాన్ భక్తి వేదాంత పీఠాధిపతి డీన్ గౌరంగ్ దర్శన్ దాస్ స్వామీజీ అన్నారు. వికలాంగులకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి మోడీ ఆసరా - వయశ్రీ యోజన పథకంలో భాగంగా గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో వయశ్రీ ఉపకరణాల గుర్తింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ ప్రధాని మోడీ దేశంలో వికలాంగులకు, వయస్త్రీల కోసం ఎన్నో పథకాలు రూపొందించారని, వాటిని వారి చెంతకు చేర్చడమే మన అందరి ధర్మం అని చెప్పారు. ఆ పనిని శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగదీష్ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు వైద్య పరీక్ష నిర్వహించి, వారికి అవసరమైన చెవిటి మిషన్లు, వీల్ చైర్స్, చేతి కర్రలు కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి సిజిఎం బేసిన్ మేనేజర్ కె. కరవనన్, జిఎంహెచ్ఆర్ మీటా ప్రసాద్, వికలాంగుల సంక్షేమ అధికారి గేదెల జగదీష్ బాబు, కోఆర్డినేటర్ ఆర్ రవికుమార్, ఎంపిడిఒ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందిపై పీడీ ఆగ్రహం

ప్రజాశక్తి- మెంటాడ

మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో డ్వామా పీడీ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేనికీ లెక్కల్లేవ్, ఓ పద్దతి లేదు, ఇష్టారాజ్యంగా వ్యవహరించారు, అంతటా అక్రమాలే, అడుగడుగునా అవకతవకలే, ఉద్యోగాలు చేసేది ఇలాగానే, ఇంత బాధ్యతా రాహిత్యమా, మీపై చర్యలు తీసుకోకుంటే మిగతా వారికి తప్పుడు సందేశం ఇచ్చినట్టు కాదా, అని పీడీ ఉమాపరమేశ్వరి మండి పడ్డారు. సిమెంట్, ఇనుము, మొక్కలూ ఏవని ప్రశ్నించారు. మీపై క్రిమినల్ కేసు ఎందుకు పెట్టకూడదని ఎపిఒపై ఫైర్ అయ్యారు. అక్రమాలకు పాల్పడిన బుచ్చిరాజుపేట ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

పీడీకి వినతిపత్రాన్నిస్తున్న రాములు

రోజు కూలీ రూ.600లకు పెంచాలి

ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600లకు పెంచాలని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి రాకోటి రాములు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన డ్వామి పీడీ ఉమా పరమేశ్వరికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో కూలి రేట్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు పాల్గొన్నారు.